


# ఒక అక్క ప్రేమ కథ

## — వసుంధర


కథా నిలయం
శ్రీకాకుళం

నా భర్త తర్వాత నన్నెక్కువగా ప్రేమించేది నా అక్కేనని నా నమ్మకం. అందుకే అక్కయ్య వస్తోందని తెలియగానే ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను.

చిన్నప్పట్నించీ డబ్బుకు లోటు లేక పోయినా ప్రేమపరంగా నేను బాగా పేదరికం అనుభవించాను. నాకు నాలుగైదేళ్ళప్పుడు తల్లి పోయింది. నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు. సవతితల్లి మంచిది కాదు. అడ్డమైన చాకిరీ చేయించుకుంటూ ఇరవై నాలుగ్గంటలూ నన్నాడి పోసుకుంటూ ఉండేది. నాన్న ఆమె నేమీ అనేవాడు కాదు. ఆయనకూ అమ్మంటే భయం.

అయితే అమ్మకు అక్క భయపడేది కాదు. దాని మనస్తత్వం

పేరు. అది నాకంటే నాలుగేళ్ళు పెద్దది. ఎవరి చేతా మాట పడదు. కొట్టినా లెక్క చేయని పెంకితనం దానిది. మా సవతితల్లికి మాటల తోటే తప్ప చేతులతో హింసించ డం ఇష్టముండేది కాదు. అందు వల్ల అక్కకు బాగానే ఉండేది. దానితో పడలేక అమ్మ ఆ కక్ష కూడా నా మీదనే చూపించేది. అదుండగా నన్నేదైనా అంటే అక్క క్షణం కూడా ఊరుకునేది కాదు. అందుకని అమ్మ అది లేనప్పుడే నన్ను బాధించేది.

చిన్నప్పట్నించీ కూడా నేను నోరు లేని దానిగా పేరు పడ్డాను. ఎవ్వరేమన్నా పడడమూ, ఇది కావాలని ఎప్పుడూ నోరు విడిచి అడక్కపోవడమూ నాకు మామూలు. పండుగలొచ్చినా, పుట్టిన రోజు లొచ్చినా అక్కే నా తరపున మాట్లాడి దెబ్బలాడి నా గురించి అన్నీ సాధించేది. నా గురించి చౌక వస్తువులేమైనా కొంటే అది తిప్పి కొట్టించేది. దాని ప్రేమాభిమానాలకు నేను మనసులో చాలా ఇదైపోతూండే దాన్ని.

అక్కకు పెళ్ళై కాపురానికి వెళ్ళిపోతున్నప్పుడు అది నన్ను గట్టిగా కౌగిలించుకుని ఏడ్చేసింది. నోరు లేని నేను ఆ యింట్లో ఎలా బ్రతుకుతానోనని వాపోయింది. నాకైతే-అంతకాలం ఉంటున్న ఏకైక ఆలంబన వెళ్ళిపోతున్న భావం కలిగింది.

అక్క వెళ్ళిపోయాక నా పాట్లు దేవుడి కెరుక. 'అమ్మతో మంచిగా ఉండు' అనడం మినహాయించి మరేం చేసేవాడు కాదు నాన్న. ఆయనకు నా మీద ప్రేమాభిమానా లున్నాయని నాకు తెలుసు. కానీ ఒక ఆడది మగవాణ్ణి ఎంత అసహా యుడిగా మార్చగలదో అప్పుడే నా కర్థమైంది. ఆ ఇంట్లో నా మటుకు నాకు తల్లీ, తండ్రీ కూడా లేరు. ఉన్న ఒక్క అక్కా నన్ను వదిలి వెళ్ళిపోయింది.

అయితే అక్క నన్ను వదిలి పెట్టలేదు. నా గురించి పెళ్ళి సంబంధాలకోసం ప్రయత్నిస్తోంది. ఆ కష్టాలలోంచి బయట పడడానికి పెళ్ళి ఒక్కటే మార్గమని దానికి తోచినట్లుంది. దాని ప్రయత్నాల ఫలితంగా ఓ మంచి సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. అక్కకు అయిన రెండేళ్ళకే నా వివాహం కూడా జరిగింది. వివాహంలో అక్క ప్రముఖపాత్ర వహించింది.

నా భర్త విద్యాధికుడు. మీదు మిక్కిలి ఆయనకు నా పై అపరి

మితమైన ప్రేమ. నన్నంతగా ప్రేమిస్తూ నా కోసమే తన జీవితా న్నంకితం చేసిన మనిషి దగ్గర ఉండడం నాకేదో వింతగా కలలా ఉండేది. అదే నన్నాయనకు ఆరాధకు రాల్నిగా మార్చింది. ఫలితంగా అంతా మా జంటను ఆదర్శంగా చెప్పుకునేవారు.

అయితే నా భర్త కూడా నాకు లాగే నోరు లేని వాడు. ఆయన చదువాయనకు మంచి ఉద్యోగాన్ని సంపాదించి పెట్టలేకపోయింది. అందువల్ల మేము సాధారణ మధ్య తరగతి జీవితమే అనుభవిస్తున్నాం. అక్క సంగతి అలా కాదు. దాని భర్త ఆఫీసరు.

పుట్టింటికి వెళ్ళినపుడు ఈ తేడా మా ఇద్దరిలోనూ కొట్టొచ్చినట్లు కనబడేది. అక్క ఎప్పుడూ రెండొందలకు తక్కువ చీర కట్టేది కాదు. నా ఖరీదైన చీరే ఏ అరవయ్యో, డబ్బయ్యో ఉండేది. వచ్చినప్పుడల్లా అది బంగారం కొనుక్కునేది. నేను స్టీలు గిన్నె కూడా కొనుక్కోలేక పోయేదాన్ని.

ఈ తేడా అమ్మకు సంతోషంగా ఉండేది. పెళ్ళయ్యాక అమ్మ అక్కను గౌరవించడం మొదలు పెట్టింది. నన్ను మాత్రం పూర్వం కంటె హీనంగా చూసేది. ఈ కారణం వల్ల అక్కంటే నాకు చాలా అభిమానమున్నప్పటికీ-అదుండగా పుట్టింటికి వెళ్ళాలని పించేది కాదు.

అంతే కాదు-బావ పెద్దఆఫీసరు, చాలా పలుకుబడి కలవాడు. అందు వల్ల బావ రాగానే ఊళ్ళో చాలా మంది అతన్ని పలకరించడానికీ, మాట్లాడడానికీ మా ఇంటికి వచ్చి వెళ్ళేవారు. ఈయన వస్తే ఎవరూ పట్టించుకునేవారు కాదు. నాకు చిన్నతనం జరిగినా ఫరవాలేదుకానీ ఆయన చిన్న బుచ్చుకుంటారని నాకు చాలా భయంగా ఉండేది. అయితే ఇలాంటి పట్టింపులు ఆడ వారి కున్నట్లుగా మగవాళ్ళ కుండ వనుకుంటాను. ఆయన చాలా సంతోషంగా బావతో మాట్లాడే వారు. బావ ఈయన్ను పెద్దగా పట్టించుకునే వాడు కాదని నా అనుమానం.

నా బాధ ఒకసారి చూఛాయగా అక్క దగ్గర వెళ్ళబుచ్చుకున్నాను. అక్క నన్ను ప్రేమాభిమానాలతో తిట్టి-"అభిమానానికీ, డబ్బుకీ లంకె పెట్టకు" అంది. ఎలాంటి కాంప్లెక్సుకూ గురికావద్దని మరీ మరీ హెచ్చరించింది. మేమిద్దరం కలిసి ఉన్నప్పుడు-ఇద్దరం దాని చీరలే కట్టుకునే వాళ్ళం.

నాకు సంబంధించిన వ్యవహారాలన్నీ స్వయంగా చూసేది అక్క. నాకు కొడుకు పుట్టినపుడు, అక్క అనారోగ్యంతో ఉన్నప్పటికీ చూడ్డానికి వచ్చి వాణ్ణి ఆశీర్వదించి మంచి బహుమతి కూడా ఇచ్చి వెళ్ళింది.

నాకు నోములు, వ్రతాలు గురించి సరిగ్గా తెలియవు. సంప్రదాయాలకు సంబంధించిన ఏ వ్యవహారం గురించి అయినా అక్కకే రాసి తెలుసుకునే దాన్ని.

నేనెప్పుడైనా ఆయన ప్రేమకు అబ్బురపడితే, ఆయన—"భర్త ప్రేమించడం పెద్ద విశేషం కాదు. నీనుంచి నాకు లభించే ఎన్నో ప్రతిఫలాల ముందు నా ప్రేమ చిన్నబోతోంది. ఏ ప్రతి ఫలమూ ఆశించకుండా నిన్ను ప్రేమించే మీ అక్క గురించే ఆశ్చర్యపడాలి. అలాంటి అక్క ఉండడం నీ అదృష్టం" అన్నారు. అది నిజమేనని అనిపించింది నాకు.

క్రమంగా నాలో వ్యక్తిత్వం సంతరించుకుంటోంది. నా ఆర్థిక స్థితి గతులు మారాయి. ఆయనకిప్పుడు ఒక ప్రైవేట్ కంపెనీలో మంచి ఉద్యోగం లభించింది. ఆయన జీతం బావకంటే ఎక్కువ వస్తోంది. నేను ఇప్పుడు ఆర్థిక వసతులు అనుభవించ గలుగుతున్నాను. పుట్టింట్లో నాకు గౌరవం పెరిగింది.

అమ్మ తన పిల్లల్ని మా దగ్గరకు పంపించాలని కూడా అనుకుంటోంది. ఎందుకంటే నేను, ఆయన కూడా క్రమశిక్షణ పాటిస్తాము. అన్నీ ఒక పద్ధతిలో నడుపుతాము. నా సవతి తమ్ముడొకడు కాలేజీ చదువుకు ఎదిగాడు. ఈయన ప్రయత్నంతో మా వూళ్ళో వాడికి సీటు కూడా వచ్చింది.

ఇలాంటి పరిస్థితుల్లో నేను, వారు కలిసి దక్షిణభారత యాత్ర చేద్దామనుకొని, అక్క కూడా వస్తుందేమోనని ఉత్తరం రాశాము. ఇటీవల మేము ఎక్కువగా కలుసుకోవడం లేదు. ఈ ప్రయాణం పేరు చెప్పి ఓ రెండు వారాలు అంతా కులాసాగా గడపవచ్చునని మా ఆశ.

అక్క అంగీకరిస్తూ జవాబు వ్రాసింది. నాకు కలిగిన సంతోషం ఇంతా అంతా గాదు. టికెట్స్ ఏర్పాట్లన్నీ ఈయన చేశారు. నేను దానిరాకకోసం ఎదురుచూస్తున్నాను.

అక్క రానే వచ్చింది. దానికిద్దరు పిల్లలు. పెద్దవాడు మగపిల్లవాడు. రెండోది ఆడపిల్ల. నాకిద్దరు పిల్లలు. పెద్దది ఆడపిల్ల. రెండోవాడు మగపిల్ల వాడు. ఓ రెండు

మూణ్నెళ్ళ తేడాలో ఉన్నారు వాళ్ళందరూ.

ప్రయాణానికింకా నాల్గురోజుల సమయముంది. ఈ నాలుగు రోజుల్లోను పిల్లలతో చాలా ఇబ్బందయింది. అక్క పిల్లలు కాస్త దుడుకువాళ్ళు. చీటికీ మాటికీ నా పిల్లల్ని కొడుతుండేవారు. నా పిల్లలు అక్కతో ఫిర్యాదు చేస్తే, "వాళ్ళు త్తినే ఎందుకు కొడతారు? మీరేదో అనే ఉంటారు" అని మందలించి పంపేసింది. పిల్లలెదురుగుండా అలా అన్నా అది తన పిలల్ని మందలిస్తుందేమోనని చూశాను. అలా చేయలేదు. ఒకటి రెండు రోజులు చూసి నేనే అక్కతో, "అక్కా! పిల్లల అల్లరిని సమర్థించ కూడదే....ఎవరైనా మన పిల్లల గురించి నేరం చెప్పినప్పుడు మనం మన వాళ్ళనే వెనకేసుకొస్తే వాళ్ళు చెడిపోతారే!" అన్నాను. అది పెద్దగా పట్టించుకోలేదు. కానీ నాకు కలగజేసుకోక తప్పలేదు. ఒకసారి అక్క పెద్ద కొడుకు నా చిన్న కూతుర్ని డొక్కలో గట్టిగా పొడిచేశాడు. అది మెలికలు తిరుగుతూ నేలమీద పడిపోయింది. నేను వెంటనే అక్క కొడుకుని మందలించాను. వాడు ఏడుస్తూ అక్క దగ్గరకు వెళ్ళిపోయాడు. ఇంకో క్షణంలో కోపంగా అక్క నా దగ్గరకు వచ్చింది. నేను అక్కకు జరిగింది చెప్పాను.

అక్క నా కూతుర్ని ఎలా ఉందని అయినా పలకరించలేదు. సానుభూతి కోసం చూసే నా కూతురి కంటి చూపుల్ని తిరస్కరిస్తూ అది అక్కణ్నుంచి వెళ్ళిపోయింది. నేను దాని ననుసరించి వెళ్ళేసరికి అది కొడుకుని ఓదారుస్తోంది. వాడేమో పిన్ని తిట్టిందని ఏడ్చేస్తున్నాడు.

అక్కకు నా స్వభావం పూర్తిగా తెలుసు. అకారణంగా నేనెవ్వరినీ ఏమీ అనను. నా పిల్లల్నయితే చిన్న తప్పుకు కూడా తీవ్రంగా మందలిస్తాను. అయినా మరోసారి అదే తప్పు చేయకుండా ఉండడం కోసమే నేను తన కొడుకును మందలించానని అది ఎందుకు అర్థం చేసుకోదు?

ఆ పూటకు అక్క తల నొప్పి వచ్చిందని పడుకుంది. ఎంత పిలిచినా భోజనానికి రాలేదు. అది తల నొప్పి కాదనీ, కోపమనీ నాకు తెలుసు. కోపం కూడా తను చేసిన తప్పుకే.

ఎలాగో సాయంత్రానికి అక్క మనసు సరిపెట్టుకుంది. నాతో అదీ ఇదీ మాట్లాతూ, "నా పిల్లలు పుట్టి

నప్పట్నించీ అబ్బురంగా పెరిగారు. వాళ్ళ మాట పడరు. నాది నడమంత్రపు సిరి కాదని నీకు తెలుసు" అంది.

ప్రయాణానికి బట్టలు సర్దుకొనేటప్పుడు, "కాస్త ఖరీదయిన చీరలు వేసుకోవే బాబూ-మన హోదాకు తగ్గట్లుగా ఉండాలి- ఏ వూళ్ళో ఉన్నా" అంది అక్క.

"ఇందులో అన్నీ ఖరీదైనవే!" అని చెప్పాను అక్కకి. ఖరీదులు విచారించి చూడగా నేను వేసిన పది చీరల్లోనూ ఆరు చీరలు అక్క చీరలకంటే కూడా ఖరీదైనవి.

"బొత్తిగా సెలక్షన్ తెలియదే నీకు? ఇంతంత ఖరీదులు పోసి ఇలాంటి చీరలా కొనుక్కోవడం?" అంది అక్క. ఏమనాలో తెలియక అక్క అలా అన్నదని నా అభిప్రాయం. ఎందుకంటే నా చీరలు నాకు అక్క చీరలకంటే బాగున్నాయి.

నా అనుమానాన్ని నిజం చేస్తూ అక్క ఆ రోజునే బావను బజారుకు తీసుకెళ్ళి ఓ అరడజను కొత్త చీరలు కొనిపించింది. అన్ని చీరలకంటే ఖరీదయినవే అవి.

ఇది నాకు చాలా విచిత్రంగా అనిపించింది. అవతల ప్రయాణంలో బోలెడు ఖర్చులుంటాయి కూడాను. డబ్బునుముందే ఇలా ఖర్చు పెట్టేసిందేమిటా అనుకున్నాను. అలాగని వాళ్ళు తెచ్చుకున్న డబ్బు కూడా ఎక్కువున్నట్లు లేదు. వెళ్ళగానే తిరిగి ఇచ్చేస్తామని అది 3 వేల రూ॥లు మా దగ్గర అప్పు తీసుకుంది—ఈ చీరలు కొనడం అయ్యేక.

పిల్లలతో ప్రయాణం నాకు బెంగగానే ఉంది. ఎదుటి వాళ్ళ పిల్లల్ని కొట్టడం తప్పని నా అక్క పిల్లలకి తెలియదు. అందుకు ఆ పిల్లల్ని తప్పు పట్టలేదు. వాళ్ళు కాసేపు స్నేహంగా ఉంటారు. కాసేపు విరోధంగా ఉంటారు. కానీ పెద్దలు సర్గ్గా ఉంటే బాధలేదు కదా!

ప్రయాణంలో ఈ పిల్లలతో చాలా ఇబ్బంది అయింది.

మా అక్క బట్టలకు తప్ప మరి దేనికీ డబ్బు ఖర్చు పెట్టదు. నాకు బట్టలకంటే కూడా పిల్లల ఆట వస్తువులపై మోజెక్కువ. మా పిల్లలకు లేని ఆట వస్తువులు లేవు. బజార్లో ఏ వస్తువు చూపినా కొనమని అక్క పిల్లలు కాల్చేసేవారు. మా పిల్లలు అడిగేవారు కాదు. ఇలా అన్నీ మాకున్నాయని మా వాళ్ళంటూంటే అక్క కొడుక్కి కోపం వచ్చి—"మా

నాన్నగారు మీ నాన్నగారికంటే గొప్ప కదా! మేం కొనుక్కో లేనివి మీరెలా కొనుక్కో గలి గారు?" అనడిగాడు.

నేను చాలా ఆశ్చర్యపోయాను. 'ఈ పెద్ద- చిన్న, గొప్ప- తక్కువ ఆలోచనలు పిల్లల బుర్రల్లోకి వాటంతటవే వచ్చాయా?' నా సందేహానికి సమాధానం త్వరగానే లభించింది.

"వాళ్ళన్నీ ఉన్నా యంటే నమ్మక్క ర్లేదు. చూసినపుడే నమ్మాలి!" అంది అక్క.

అక్కకు కొంత అసహనం ఏర్పడిందని నాకు అర్థమైపోయింది. పిల్లలకు అబద్ధాలాడే అవకాశాలు సృష్టిస్తోంది తను. ఈ రోజు నా పిల్లల మాటల్లో అబద్ధాన్నూహించు కుంటే రేపు అక్క పిల్లలు ప్రపంచంలో ఎవరిని నమ్మగలరు? తాత్కాలికమైన అసహనంలో అక్క తన పిల్లలకెంత అన్యాయం చేస్తుందో గ్రహించడం లేదు. చిన్నప్పుడు నన్ను కంటికి రెప్పలా చూసుకున్న అక్క పిల్లలకు జరిగే ఈ అన్యాయాన్ని వారించాలని నాకుంది.

ఎందుకంటే ఆ పిల్లలు ఇరవై నాలుగు గంటలూ తమ తండ్రి గొప్పతనం గురించీ, తల్లి గొప్పతనం గురించీ, తమ వైభవం గురించీ, తమను చూసి ఇతరు లసూయ పడే వైనం గురించీ తప్ప ఇంకేమీ మాట్లాడడం లేదు. సర్వ మానవ సమానత్వం, సహజీవన సౌభాగ్యం-ఈ వయసులో దూరం చేసుకుంటే వాళ్ళకు మళ్ళీ అలాంటి అవకాశం లభిస్తుందా?

ఒకసారి మందలించ బోయి నందుకు అక్క నన్ను స్పష్టంగా హెచ్చరించింది— "నా పిల్లల్ని ఆఖరికి నా చెల్లెలు మందలించినా నేను సహించలేను."

పిల్లల సంగతి అలా ఉంటే అక్క నన్ను కూడా చాలా ఇబ్బందుల్లో పెట్టింది. నా అల వాట్లనూ, అభిరుచులనూ అన్నిం టినీ విమర్శించి-తన అలవాట్లనూ, అభిరుచులనూ ప్రశంసించుకుని— నేను తనకిలా ఎప్పటికి మారతానో నని వాపోయింది. ఈ ప్రయాణంలో నేను గమనించిన దేమిటంటే నేను చేసే ఒక్క ప్రతిపాదన కూడా అక్క ఆమోదించలేదు. అందుకు పోనీ తర్కాన్నయినా పాటించలేదు.

ఒకసారి నేను వేరుశెన క్కాయలు కొంటూంటే— "అసహ్యంగా రోడ్డుమీద సరుకు ఏం కొంటామే" అని తీసి పారేసింది.

మరోసారి తనే వేయించిన కారపు శనగలు కొందామంది.

మేము త్రివేంద్రంలో ఉండగా కోవలం బీచికి టాక్సీలో వెడదా మని అన్నాను నేను. అక్క సిటీ బస్సులో వెడితే డబ్బు ఆదా అవు తుందంది.

"టాక్సీలో వెడితే ఓ గంటలో వెనక్కి రావచ్చు. అందువల్ల ఓ పది రూపాయలు ఎక్కువైనా మధ్యాహ్నం బస్సులో వెళ్ళి పోవచ్చు. అదే బస్సులో వెడితే- ప్రయాణం రాత్రికి వాయిదా వేసు కోవాలి. సాయంత్రం మూడు దాటితే మనం ఇంకో రోజు అద్దె ఇచ్చుకోవాలి. ఇద్దరికీ కలిపి అరవై రూపాయాలు నష్టం" అన్నాను.

"ఏమిటో—లెక్కలు చెప్పి కంగారు పెట్టేస్తున్నావు. నీ భాష నా కర్థం కాదే బాబూ! పోనీ డబ్బు నష్టమైందనే అనుకుందాం—అస లింట్లో కూర్చుంటే ఏ ఖర్చులూ ఉండేవి కాదుగదా! చిన్నప్పట్నించీ ఇంతే నువ్వు. నీ పిసినారితనం ఎప్పటికి పోతుందో కానీ!" అంది అక్క.

బెంగుళూర్లో చీరలు కొను క్కున్నాను నేను. ప్రయాణాల్లో చీరలు కొనడం దండగని గట్టిగా చెప్పిందది. కానీ నేను వినలేదు ఆఖరికి చీరలు కూడా నాకు నచ్చినవే, అది బాగోలేదని అన్నప్ప టికీ కొన్నాను. తర్వాత అది కూడా అంతకంటె కాస్త ఖరీదైన చీరలు తనకు మళ్ళీ కొనుక్కుంది.

కొత్త కొత్త ప్రదేశాలు చూడ్డం నాకెంతో ఆనందంగా ఉన్నప్పటికీ అక్క ప్రవర్తన నాకు చాలా బాధ కలిగించింది. అదిలా ఎందుకు మారిపోయిందో—నా పట్ల ఇంత అసహనంగా ఎందుకుంటుందోనాకు తెలియలేదు. అక్క ప్రేమను పోగొట్టుకోవడానికి నేనేం తప్పు చేశానో కూడా నాకు తెలియలేదు.

అయితే తిరుగు ప్రయాణంలో నేను తిరిగి అక్క ప్రేమను పొందగలిగే వరకూ అసలు సంగతి నాకు అర్థం కాలేదు.

విజయవాడలో ప్లాట్ఫారం మీదకు వొంగి చూస్తుండగా ఓ దొంగ నా మెడలోని గొలుసు తెంపుకు పోయాడు. బంగారపు గొలుసు- రెండు వేలకు తక్కు వుండదు.

"దొంగ!" అని అరవడం జరి గింది కానీ వాడు మెరుపులా మాయ మయ్యాడు.

నాకు కళ్ళ నీళ్ళ పర్యంత మైంది.

"బాధపడకు! నీ అంత జాగ్రత్త

పరురాలి దగ్గర గొలుసు తెంపు కెళ్ళడం ఆ దొంగ గొప్పతనాన్ని చాటుతోంది" అన్నారాయన నన్ను ఓదారుస్తూ.

అక్క నాకు దగ్గరగా జరిగింది ప్రేమగా భుజంమీద నిమిరింది. "ఇంతవరకూ అంతా ప్రయాణంలో సవ్యంగా జరిగిపోయిందను కున్నాను. ఇలా జరగడం నాకు చాలా బాధగా ఉంది. ఆ గొలుసు నేను నీకు చేయించి పెడతానులే" అంది.

నేను ఆశ్చర్యపోయాను. దాని చేయి నా భుజాన్ని తాకుతూంటే నాలో దుఃఖం పొంగుకొచ్చింది. దాని ఒడిలో తల పెట్టుకుని ఏడ్చేశాను. అది ఆప్యాయంగా నా జుట్టులో తన వేళ్ళు కదుపుతోంది.

కాసేపటికి నేను తేరుకున్నాను. కానీ బాధ నన్ను వదల్లేదు.

"అది పోలేదనే అనుకో! నేను నీకు చేయించి పెడతాగా" అంది అక్క.

"గొలుసు వద్దు అక్కా! నేనే చేయించుకొంటాను. నీ అభిమానం ఎప్పటికీ ఇలా ఉంటే చాలు!" అన్న నాకు అక్క అభిమానంలోని రహస్యం తెలిసిపోయింది. ఇంత కాలం అక్క నన్ను ప్రేమిస్తోందని భ్రమ పడ్డాను. దానికి నా మీద ఉన్నది ప్రేమ కాదు-జాలి! ప్రేమ ఏదైనా ఉంటే అది జాలి కారణంగా పుట్టినదే నని అర్థమైంది.

నేను కష్టాల్లో ఉండేదాన్ని. ఇప్పుడు కష్టాలు లేవు. నోరులేని దాన్ని. ఇప్పుడు నోరు లేక పోయినా ఇబ్బంది లేదు. ఒకప్పు డెవరి ప్రేమనూ నోచుకోలేదు. ఇప్పుడు నన్ను ప్రాణాధికంగా ప్రేమించిన భర్త ఉన్నాడు. ఒకప్పుడు నాకు డబ్బులేదు. ఇప్పుడు నాకు డబ్బుకు లోటులేదు. ఒకప్పుడు నేను అన్నింటికీ అక్క సలహాలే తీసుకునేదాన్ని. ఇప్పుడు వ్యక్తిత్వం వచ్చింది. నా పిల్లలు, నలుగురూ మెచ్చే క్రమ శిక్షణ కలిగి ఉన్నారు.

ఏ విధంగా చూసినా జాలి పడవలసిన స్థితిలో లేను నేను. అందుకు అక్క సంతోషించాలి. జాలిపడవలసిన స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ప్రేమించగల నా అక్క నన్నిప్పుడెలా ప్రేమించ గలదు? ఇప్పుడు. నా అక్క నన్ను ప్రేమిం చాలంటే నేను నగలైనా పోగొట్టుకోవాలి, లేదా నన్ను కష్టాలు తరుముకు రావాలి!

అక్క ప్రేమ నాకు బాగుం టుంది. కానీ ఆ ప్రేమకోసం ఇంత త్యాగం చేయగలనా?

మరోసారి అక్క వంక చూశాను.

అక్క ఇంకా నా వంక జాలిగా చూస్తూనే ఉంది. ●